— చెళ్లాం సీతారాజేశ్వరరావు



# మేనేజర్‌గారి మేనల్లుడు

ఫ్యాను ఆగిపోవడంతో మెలకువ వచ్చేసింది. ఎదురుగా గోడ మీది అలారం 5-35 చూపిస్తోంది. వేసవి ఎండ ఇంకా బయట ఉధృతంగా వుంది. వళ్ళు విరుచుకుంటూ లేచి కూర్చున్నాను. టీపాయ్ మీద రెండు ఉత్తరాలు వచ్చి వున్నాయి.

ప్రక్క గదిలో గుమ్మం దగ్గర రూపీ సూట్‌కేసు సర్దుతోంది. పిల్లలిద్దరూ, వేసిన బట్టలు బాగా లేవని మారాం చేస్తున్నారు.

ఝాన్సీ పుట్టింటి ప్రయాణం గుర్తు వచ్చింది.

మొదటి ఉత్తరం స్నేహితుడి దగ్గర్నుంచి. తిరుపతి వచ్చినపుడు నేను చూపిన సహకారానికి ధన్య వాదాలు తెలిపాడు. రెండవది మా మేనేజర్ రాసింది.

"బుధవారంనాడు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో మా మేనల్లుడు మురారి తిరుపతి వస్తున్నాడు. అత డికి కొత్త. మీరు దగ్గరవుండి అన్నీ చూపించవలెను. మీరు గుర్తు పట్టడానికి వీలుగా వెయిటింగ్ రూమ్ దగ్గర ఆకు పచ్చటి రుమా లుతో కనిపిస్తాడు."

బుధవారం రేపే!

"ఏమండోయ్...ఇంకా లేవ లేదా? అవతల రైలు వెళ్ళి పోతుంది." ఝాన్సీ టీ ఇస్తూ హెచ్చరించింది.

"మన ఇండియాలో ఆ ప్రమాదం వుండదులే!" ఆమెను చేయి పుచ్చుకొని లాగాను. ఝాన్సీ మంచంమీద తూలిపడిపోయింది. కనకాంబరం రంగుచీరలో ఆమె లావణ్యం మరి కొస్త పెరిగినట్లని పించింది.

"అవతల పిల్లలున్నారన్న జ్ఞానం లేదా?" కసురుకుంటూ అంది.

"నేను అజ్ఞానిని." ఎడం చేత్తో ఆమెని దగ్గరకి లాక్కున్నాను. ఆమె మెత్తటి శరీరం తగిలి గగు ర్పాటు ఉంది.

ఝాన్సీ విదిలించుకొని లేచింది.

"బాగుంది మేళం. అవతల టైం అవుతోంది. లేచి బట్టలు వేసు కోండి!"

"మళ్ళా ఎప్పుడు రాక?"

"ఎల్లుండి ఒడుగు అయిన వెంటనే బయలుదేరి వచ్చేస్తాను."

"మీది అసలే బీరపాదు. ఒడుగు తర్వాత ఏ బారసాలో, అన్న ప్రాశనో, రజస్వలో తగులుతుంది." ఝాన్సీకి నలుగురు అన్నలు ముగ్గురు అక్కయ్యలు వున్నారు.

"మీలా ఒంటెత్తు రాకాసులం కాదు లెండి!"

నేను పోయి రిక్షా తీసుకు వచ్చాను. ఝాన్సీని పిల్లలని రిక్షాలో ఎక్కించి, వెనకాల సైకిల్ మీద బయల్దేరాను.

తిరుపతి తూర్పు-పది పెళ్ళిళ్ళు జరుగుతున్న సత్రంలా వుంది. అదృష్టవశాత్తు రిజర్వేషన్ చేయిం చడంవల్ల ఝాన్సీని పిల్లలని ఎక్కించడం ఇబ్బంది కాలేదు.

"తలుపులకి తిన్నగా తాళంవేసి మరీ వెళ్ళండి. మీ కసలే పర ధ్యానం ఎక్కువ!" ఝాన్సీ రైలు కదులుతున్నా నాకు సలహాలు,

సూచనలు ఇస్తూనే ఉంది.

రైలు ప్లాటుఫారం దాటగానే నేను బయటకి వచ్చాను. దాహంగా వుండటంతో కూల్‌డ్రింక్ షాపుకి వెళ్ళి ఫ్రూట్‌సాలిడ్ ఆర్డరిచ్చాను.

మేనేజర్‌గారి ఉత్తరం గుర్తు వచ్చింది. ఆయన మేనల్లుడ్ని జాగ్రత్తగా రిసీవ్ చేసుకోవాలి. ప్రమోషన్ గురించి ఆయన్ని ఎప్పట్నుంచో అడుగుతున్నాను. మేనల్లుడు—కాబోయే అల్లుడు కూడానేమో! అతను రెండు మంచి ముక్కలు చెబితే ప్రమోషన్‌కి ఇక తిరుగుండదు. ఇలాంటి వారిని డబ్బిచ్చి మెప్పించలేం. సదుపాయాలు చేస్తే ప్లీజవుతారు!

అరె...సమయానికి రూమ్ కూడా ఇంటి దగ్గరలేదు. వంటకి ఇబ్బంది అవుతుందేమో! లేకపోతే భీమాస్‌నుంచి తెప్పించాలి.

ఇంటికి బయలుదేరుతూండగా భావనవర్మ కనిపించాడు. "నేను సినిమానోము పట్టాను. వాయినం ఇస్తా రా గురో" అన్నాడు.

"పనుందోయ్!"

"ఇది మాత్రం పని కాదూ!"

బలవంతంగా లాక్కుపోయాడు.

ఫస్ట్ షో, సెకండ్ షో అయ్యే దాక నన్ను వదలలేదు. ఇంటికి వచ్చేసరికి రెండయ్యింది. ఆరు గం॥కి మెలకువ వస్తుందా? ఆలస్యమైతే మురారికి తనమీద ఇంప్రెషన్ పోతుందేమో!

అలారం పెట్టి పడుకున్నాను. ఆరింటికి అలారం పెడితే ఆరున్నరకి మెలకువ వచ్చింది. అనుకున్నంతా అయింది.

చొక్కా వేసుకుని స్టేషన్‌కి పరుగు. ఇంకా తిరుమల రాలేదు. అరగంట లేటు. బలంగా ఊపిరి పీల్చుకున్నాను.

పంపు దగ్గర ముఖం కడిగి కాఫీ తాగాను. సిగరెట్ వెలిగించి ప్లాట్‌ఫారం మీద పచార్లు చెయ్యసాగేను.

బండి రానేవచ్చింది. మురారిని గుర్తుపట్టడం ఏం ప్రయాసకాలేదు. నన్ను నేను పరిచయం చేసుకున్నాను.

"మామయ్య వుత్తరం అందిందన్నమాట! థాంక్స్ టు పోస్టల్." మురారి నవ్వాడు.

ఇద్దరం బయటకి వచ్చి కాఫీలు తాగేం. "మా యింటికి పోయి రెస్టు తీసుకుని సాయంత్రం వెళదాం కొండమీదికి" అన్నాను.

"ఎందుకండీ శ్రమ? హోటల్లో వుంటాను."

"భలే వారే. మా ఫ్యామిలీ లేదు. ఏం మొహమాటం పడకండి."

"థాంక్యూ! దర్శనం అయిపోయాక, మీ యింటి దగ్గర రెస్టు తీసుకుంటాను. వెంటనే చెయ్యకపోతే బద్ధకం మీద అసలు చెయ్యలేను తర్వాత."

"సరే.... అలాగే కానివ్వండి" అన్నాను.

కొండమీదికి పోయే బస్సులు రద్దీగా లేవు. పదిగంటలకి కొండమీదకి చేరుకున్నాం. నేను కాటేజీకి డబ్బు యిస్తూంటే మురారి అభ్యంతరం చెప్పాడు. "అన్నిటికి మీరు పర్స్ తీయడం బాగాలేదు."

"మీరు మా అతిథి."

"తిరుపతిలో వున్న మీకు మాలాంటి అతిథులు రోజూ తగులుతారు."

"మీరు అందరిలాంటి వారు కారులెండి!"

"నా గురించి తెల్సా?" అదోలా చూస్తూ అడిగాడు.

"మేనేజర్‌గారు బాగా తెల్సు. అంచేత మీరు తెల్సినట్లే!" నవ్వాను.

దర్శనం అయ్యేసరికి రెండయింది. భోజనంచేసి కాటేజీలో విశ్రమించాం. నాకు నిద్ర పట్టేసింది. మురారి లేపితేగాని సాయంత్రం మెలకువ రాలేదు.

"వెళ్ళిపోదాం!" అన్నట్లు ప్రసాదం మరచిపోయాను. మామయ్యకి తిరుపతి లడ్డూలంటే చాల యిష్టం."

"మీరు రెడీగా వుండండి. నేను వెళ్ళి తీసుకువస్తాను." బట్టలు వేసుకుని దేవస్థానం వైపు వెళ్ళాను.

ఆరు లడ్డులు కొని తిరిగి వచ్చేసరికి, మురారి ఎయిర్‌బాగ్‌తో మెట్లమీద నిలబడి వున్నాడు. గుండు నీరెండలో మెరుస్తోంది.

క్రిందకి పోయే బస్సులు రద్దీగా వున్నాయి. ముప్పావుగంట క్యూలో నిలుచుంటేగాని బస్ దొరకలేదు. బస్ దిగగానే రిక్షా వేసుకుని యింటికి వచ్చాం.

అదృష్టవశాత్తు మా పనిమనిషి యింకా వెళ్ళిపోలేదు. ప్రక్కవారింటిలో పని చేస్తోంది. దాన్ని పిలిచి మురారి స్నానానికి ఏర్పాట్లు చేయించాను.

నేను హోటల్‌నుంచి టిఫిన్ తీసుకు వచ్చేసరికి మురారి గుండుకి గంధం రాసుకుంటున్నాడు. నన్ను చూసి—"మళ్ళీ మనం పైకి వెళ్ళి రావాలండీ! కాటేజీలో డైరీ మరచిపోయాను!" ఆందోళనగా అన్నాడు.

"వెళితే వుపయోగం వుంటుందంటారా?"

"అందులో డబ్బులేదు కనుక ఎవరికీ వుపయోగపడదు. రిసెప్షన్‌లో యిస్తారు. మీరు రాకపోతే

నేనయినా వెళ్ళితీరాలి." హడావిడిగా అన్నాడు.

ఇంతాచేసి యిక్కడా వెన కాదటం? ప్రొద్దుటనుంచి ఏర్పరచుకున్న యింప్రెషను అంతా పోతుంది. "నడవండి.... టిఫిన్ చేసి పోదాం."

టిఫిన్ పూర్తయింది.

"ఇద్దరం ఎందుకండీ దండగ. నేను వద్దామా అంటే బాగా అలసటగా వుంది ప్రయాణంవల్ల." నసుగుతూ అన్నాడు మురారి.

"నేను పోయి వస్తాలెండి" అన్నాను.

"మీకు శ్రమ ఇస్తున్నాను" అన్నాడు.

డైరీ వివరాలు తెల్సుకుని బయలుదేరాను. బస్సు వెంటనే దొరికింది. శేషాద్రి నగర్‌లోని కాటేజీకి పోయాను. ప్రొద్దుట మేం ఖాళీ చెయ్యగానే తెనాలినుంచి ఎవరో వచ్చారు. వారిని డైరీ గురించి అడిగాను. ఏం తెలియదన్నారు. రిసెప్షన్‌లో అడిగినా ఫలితం లేకపోయింది.

ఇంటికి పన్నెండు గం॥కి తిరిగి వచ్చాను. తలుపులు దగ్గరగా వేసి వున్నాయి. "మురారిగారూ!" లైటు వేస్తూ పిలిచాను.

మురారి లేడు. అనుమానం వచ్చింది. ఇల్లంతా కలయతిరిగాను. అలమార్లు, డ్రాయరు, బీరువా తెరచి వున్నాయి.

టేప్ రికార్డర్, వెండి కంచం, ఝూన్సీ గొలుసు, డ్రాయర్‌లోని ఆఫీసు డబ్బు రెండువేలూ కన్పించలేదు.

డ్రాయరు మీద చీటీ కనిపించింది. ఆతృతతో విప్పి చదివాను కంగారుగా.

"థాంక్యూ బ్రదర్! నేను మీ మేనేజర్‌గారి మేనల్లుణ్ని కాను. నా పేరు మధుసూదనం. మురారి రైల్లో పర్స్, సామాను పోగొట్టుకొని ఏడుస్తూ కూర్చున్నాడు. నెల్లూరులో తన కథ నాతో చెప్పుకున్నాడు. ఇంటికి వెళ్ళడానికి యాభై రూపాయలు సాయం చేశాను. మురారి నెల్లూరునుంచి తిరిగి హైద్రాబాద్ వెళ్ళిపోయాడు. నేను మురారిగా మీ దగ్గరకి వచ్చాను. మర్యాద చేశారు. పదివేలు వస్తురూపంగా సాయం చేశారు. నా దొంగతనం మీ గుండెల్ని కోస్తుంది. భరిస్తారు కదూ!—మురారి అనే మధుసూదనం."

నాలో ఏమాత్రం చలనం లేదు— అచేతనంగా నిలబడి పోయాను. •